క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచ్ జ్యోతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మండలంలోని నందబలగ గ్రామపంచాయతీ సర్పంచ్ కొర్ను జ్యోతిని ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె విశాఖపట్నంలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం ఇంటి వద్దనే కోలుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఆమె వద్దకు వెళ్లి, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 67 మంది ఎంపిక



శిబిరానికి వచ్చిన వారి కళ్లను తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, వైఎస్సార్ కంటివెలుగు పథకం ద్వారా నిర్వహించిన ఈ శిబిరానికి 160 మంది హాజరై, తమ కళ్లను తనిఖీ చేసుకున్నారు. 67 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేయగా, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు.

ఆకట్టుకున్న వేషధారణ



కాటమరాయుడి వేషం వేసుకున్న వ్యక్తి

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామంలో నందెన్న అనుపోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ప్రధానంగా ఓ వ్యక్తి వేసిన కాటమరాయుడి వేషధారణ చూపరులను ఆకర్షించింది.

వరికోతలు ఆరంభం



తాటిపాడులో వరికోత కోస్తున్న రైతులు

రేగిడి: మండలంలోని తాటిపాడు, లచ్చన్నవలస, బూరాడ తదితర గ్రామాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. పంట బాగా పండడంతో కోతలు ఆరంభించిన రైతులు ఈ ఏడాది దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది కూలీల సహాయంతో కోతలు చేయగా, మరికొంతమంది నూర్పిడి యంత్రాల ద్వారా ధాన్యం సేకరించి, ఇళ్లకు తరలిస్తున్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



చూడి పరీక్ష చేస్తున్న పశువైద్యాధికారి రాజేశ్వరి

రాజాం సిటీ: పశువ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రాజేశ్వరి సూచించారు. ఆదివారం మండలంలోని బి.ఎస్.వలస గ్రామంలో పశువ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆవుదూడలు, పశువులకు డీవార్మింగ్ మందులతో పాటు నట్టలనివారణ మందులు వేసి, చూడి పరీక్షలు చేశారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ పండగ

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో దుర్గమ్మ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులంతా గ్రామ శివారులోని వేపచెట్టు వద్ద కొలువైన అమ్మవారి వద్దకు వెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

సంతకవిటి: మండలంలోని మద్దూరు రామయ్య అగ్రహారం గ్రామంలో వెలసిన మరిడమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం మహిళా భక్తులంతా అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, పంటలు బాగా పండాలని, రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని వేడుకున్నారు.

పక్కాగా ఓటరు జాబితా

పక్కాగా ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కు నమోదుకు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈఆర్వో(ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్)లు, బీఎల్వో(బూత్ లెవల్ ఆఫీసర్)లు కలిసి, ప్రభుత్వం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాను తొలుత ప్రదర్శించారు. ఓటరు విజ్ఞప్తుల మేరకు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టారు. అనంతరం కొత్తగా ఓటు హక్కు కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్ల వయసు నిండిన యువతీ, యువకులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కోరారు.

–బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: మిర్తివలసలో ఓటు హక్కు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దారు సులోచనరాణి, సర్పంచ్ రాంబాంబు



బాడంగి: గజరాయునివలసలో ఓటుహక్కు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై సూచనలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ



తెర్లాం: వెలగవలసలో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దారు రత్నకుమార్



వంగర: అరసాడలో ఓటరు జాబితా పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధారాణి



రాజాం: మారేడుబాకలో వైస్ ఎంపీపీ వెంకటేష్‌కు ఓటరు జాబితా అందిస్తున్న బీఎల్‌వోలు



బొబ్బిలి: ఆర్డీవో సాయిశ్రీకి ఓటరు దరఖాస్తులు అందజేస్తున్న దరఖాస్తుదారులు



రేగిడి: వన్నలిలో అభ్యర్థుల నుంచి ఓటు నమోదు దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌వో భారతి



రాజాం సిటీ: బొద్దాంలో ఓటుహక్కు నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు కృష్ణంరాజు

నేడు ప్రజాసంకల్పయాత్ర విజయోత్సవ సభ

రామభద్రపురం: ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే విజయోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణనాయుడు కోరారు. కార్యక్రమంలో భాగంగా తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును వివరించడం జరుగుతుందన్నారు.

ఉదయం 11 గంటలకు..

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రజాసంకల్పయాత్ర విజయోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర ద్వారా ఆయన తెలుసుకున్న ప్రజాసమస్యలను ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత పరిష్కరించారన్నారు. ఇదే విషయాన్ని విజయోత్సవ సభలో ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత మాధవబజార్ ఎదురుగా ప్రధాన రోడ్డుపై ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.

నేడు పోరాం గ్రామానికి డిప్యూటీ సీఎం

మెంటాడ: మండలంలోని పోరాం గ్రామానికి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రానున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ నెల 8వ తేదీన నియోజకవర్గ కేంద్రంలో బస్సుయాత్ర చేపట్టనున్న నేపథ్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమై, కార్యక్రమ విజయవంతానికి దిశానిర్దేశం చేయనున్నారన్నారు. అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడతారన్నారు.

15న చలో విజయవాడ

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు తెలిపారు. ఇదే విషయమై రూపొందించిన కరపత్రాలను ఆదివారం పట్టణంలోని పలు కూడళ్లలో పంపిణీ చేసిన ఆయన సామాన్య ప్రజలను ఇబ్బందులు పెట్టేలా కేంద్రం పాలన ఉందని విమర్శించారు. ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి, ప్రధాని మోదీ పాలనకు చరమగీతం పాడాలని కోరారు.

ఒత్తిడి లేని విద్యనందించాలి

రాజాం: పిల్లలకు ఒత్తిడి లేని విద్యనందించాలని రాజాం ప్రాంతానికి చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు బూరాడ శివకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశమైన ఆయన చిన్నప్పటి నుంచే అభ్యసనంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అంశాలతో పాటు అనాసక్తి ఉన్న అంశాలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతీ విషయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు తగినంత స్వేచ్ఛనివ్వాలని, విద్యతో పాటు విలువలను కూడా నేర్పించాలన్నారు.



విద్యార్థులను మోటివేట్ చేస్తున్న శివకృష్ణ

ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయండి



రాజాం: రాజీపేటలో ఇంకుడుగుంత నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: మండలంలోని అన్ని గ్రామసచివాలయాల భవనాల వద్ద ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలని ఏపీడీ ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని బొద్దాం, రాజీపేట గ్రామ సచివాలయాల వద్ద నిర్మించిన ఇంకుడుగుంతలను ఆయన ఆదివారం పరిశీలించారు. పనుల నాణ్యతతో పాటు ఇంకుడుగుంతల కొలతలు పరిశీలించారు. నిర్మాణాల నిమిత్తం రూ.50 వేలను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీవో హరనాధరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలతో మహిళల అభివృద్ధి

వంగర: డ్వాక్రా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని రాజాం ఏరియా కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి అన్నారు. విజయనగరంలో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. రాజాం నియోజకవర్గానికి చెందిన మూడు యూనిట్లు(స్టాళ్లు) వద్దకు వెళ్లి, విక్రయాలపై ఆరాతీశారు. ఇప్పటివరకు అమ్మకాల ద్వారా మొత్తం రూ.6.50 లక్షలు వచ్చినట్లు విక్రేతలు తెలిపారు. వంగర మండలంలోని కొప్పర పిడికర్రలు(మాప్‌స్టిక్స్), సంతకవిటి మండలంలోని సురవరం చేనేతవస్త్రాలు, రాజాం మండలంలోని కంచరాం పచ్చళ్లను స్టాల్స్‌లో విక్రయిస్తుండగా, వాటికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు.



అఖిల భారత డ్వాక్రా బజార్‌లో పిడికర్రల స్టాల్‌ను పరిశీలిలస్తున్న రాజాం వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ చిరంజీవి

గణిత పోటీల విజేతలు వీరే..

రాజాం: స్థానిక డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి గణిత పోటీలు ఆదివారం నిర్వహించారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం నిర్వహించిన ఈ పోటీల్లో 200 మంది విద్యార్థులు పాల్గొనగా, పరీక్ష అనంతరం విజేతల వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. పదో తరగతికి సంబంధించి, వై.గోవింద(జెడ్పీహెచ్ఎస్, పొగిరి), పి.సాయి(జెడ్పీహెచ్ఎస్, పొగిరి), ఎల్.రాధిక(జెడ్పీహెచ్ఎస్, డోలపేట), పి.రమ్య (జీహెచ్ఎస్, రాజాం), బి.అరవింద్(జీహెచ్ఎస్, రాజాం), కె.హేమలత(జెడ్పీహెచ్ఎస్, కంచరాం), జె.సురేష్(జెడ్పీహెచ్ఎస్, పొగిరి), పి.దుర్గాభవానీ(జీహెచ్ఎస్, రాజాం), ఏఎస్ ఆచారి(జెడ్పీహెచ్ఎస్, కంచరాం), ఎ.జ్యోత్స్న(జెడ్పీహెచ్ఎస్, డోలపేట), డి.వివేక్(జెడ్పీహెచ్ఎస్, డోలపేట)లు విజేతలుగా నిలవగా, తొమ్మిదో తరగతికి సంబంధించి, సీహెచ్ హర్ష(జెడ్పీహెచ్ఎస్, డోలపేట), బి.దినేష్(జెడ్పీహెచ్ఎస్, కంచరాం), పి.శిరీష(జెడ్పీహెచ్ఎస్, కంచరాం), జె.ద్రాక్షాయని(జెడ్పీహెచ్ఎస్, పొగిరి), డి.కీర్తి(జెడ్పీహెచ్ఎస్, డోలపేట), డి.నవదీప్(జెడ్పీహెచ్ఎస్, డోలపేట), ఎం.గణేశ్వర్(జెడ్పీహెచ్ఎస్, డోలపేట), ఎం.కిశోర్(జెడ్పీహెచ్ఎస్, డోలపేట), ఎం.శ్యామ్ సుందర్(జెడ్పీహెచ్ఎస్, పొగిరి), పి.లావణ్య(జెడ్పీహెచ్ఎస్, పొగిరి) విజేతలుగా నిలిచారు. వీరంతా డిసెంబరు 9వ తేదీన జరుగనున్న జిల్లా పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలను ఉపాధ్యాయ సంఘం అభినందించింది. కార్యక్రమంలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు శాసపు సత్యనారాయణ, ఎల్.గోవిందరావు, కె.శివప్రసాద్, డి.సునీత, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నీలంనాయుడు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విజేతల వివరాలు వెల్లడిస్తున్న సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: బైక్ ఢీకొని వర్రి శ్రీనివాసరావు అనే వ్యక్తికి గాయాలైన ఘటన స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో ఆదివారం జరిగింది. పట్టణంలోని చిన్నహరిజన వీధికి చెందిన ఆయన శనివారం రాత్రి 12 గంటల సమయంలో ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి బొబ్బిలి జంక్షన్ వైపు నడుచుకుని వస్తుండగా, ఆయనకు ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన అతడిని రాజాంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.

దాడి కేసు నమోదు

రాజాం సిటీ: మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన ఆబోతుల సూరీడమ్మపై అదే గ్రామానికి చెందిన చందక రాము, పాపారావులు దాడి చేసినట్లు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వై.రవికిరణ్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. సూరీడమ్మ తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో చెత్త తుడుస్తుండగా పొరుగింటికి చెందిన రాము వచ్చి, కాలువ పక్కనున్న చెత్తను ఎందుకు తీస్తున్నావని చేతులతో తోసివేయడంతో ఆమె ఆ పక్కనే ఉన్న రాయిపై పడిపోయింది. రాము కొడుకు పాపారావు కూడా కర్రతో దాడి చేయడంతో ఆమె చేతికి గాయమైంది. గ్రామస్తులు వారిని సముదాయించి, చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఆరికతోటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమామణి ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

సంతకవిటి: మండలంలోని సురవరం, సంతకవిటి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. సురవరంలో ఉదయం, సంతకవిటిలో సాయంత్రం ఈ కార్యక్రమం ఉంటుందని, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొనే ఈ కార్యక్రమానికి ఇరు ప్రాంతాల పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

మండల సమావేశం..

మెంటాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సాధారణ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో త్రివిక్రమ్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలన్నారు.

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, ఎంపీడీవో రవికుమార్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులంతా హాజరు కావాలని కోరారు.

రూ.1.32 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో రూ.1.32 కోట్ల వ్యయంతో జల్ జీవన్ మిషన్ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి, తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రస్తుతం పైపులైన్ ఏర్పాటుకు సంబంధించి, మట్టితవ్వకాలు ఊపందుకున్నాయి. రేగిడి ఆమదాలవలస మండలంలోని సంకిలి దగ్గరున్న నాగావళి నది నీటిని ఇక్కడకు తరలించి, పైపులైన్ల ద్వారా కుళాయిలతో తాగునీటిని సరఫరా చేయనున్నారు. ఈ పనులను మండల వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క తవిటమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు ఆదివారం పరిశీలించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



తాగునీటి కుళాయిల పైపులైన్ ఏర్పాటుకు చేస్తున్న మట్టితవ్వకాలను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ వర్షిణి

'వై ఏపీ నీడ్స్ జగన్'ను విజయవంతం చేయాలి



పార్టీ నేతలను దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: నియోజకవర్గంలో ఈ నెల 9వ తేదీ నుంచి చేపట్టే వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన కార్యక్రమం జయప్రదం అయ్యేలా పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ, మండల, మున్సిపాలిటీ స్థాయిల్లో కార్యక్రమం జరిగేలా చూడాలన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి, వివరించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న సామాజిక సాధికార బస్సుయాత్ర కూడా బొబ్బిలిలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సీఎం జగనన్న చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు కావస్తున్న సందర్భంగా ప్రతిచోటా కార్యక్రమం నిర్వహించి, సీఎం జగన్ సంక్షేమ పాలనను వివరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఎంపీపీలు శంబంగి లక్ష్మి, చొక్కాపు లక్ష్మణరావు, నర్సుపల్లి ఉమాలక్ష్మి, భోగి గౌరి, జెడ్పీటీసీలు అప్పికొండ సరస్వతి, సంకిలి శాంతకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి, పింఛన్ అందజేత

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామ సచివాలయం పరిధిలోని రాజయ్యపేటకు చెందిన గవర లక్షుమమ్మ గుండె శస్త్రచికిత్స నిమిత్తం శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చేరింది. వలంటీర్ దిలీప్‌కుమార్ ఆమె వద్దకు ఆదివారం వెళ్లి, పింఛన్ నగదు అందజేశారు. వలంటీర్ తన సొంత డబ్బులతో ఆస్పత్రికి వెళ్లిమరీ పెన్షన్ అందజేయడం పట్ల గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఇదిలా ఉండగా, సుందరాడ గ్రామ సచివాలయం పరిధిలోని ఎస్.బూర్జవలస గ్రామానికి చెందిన బోనంగి సత్యంనాయుడు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, అతడి వద్దకు వలంటీర్ తాడివలస రాము వెళ్లి, పెన్షన్ డబ్బులు అందజేశారు.



ఆస్పత్రిలో లక్షుమమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో మూడు రోజులుగా పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత యలకల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. ప్రధాన రోడ్లు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు కాలువల్లో ఉన్న మురుగును తొలగిస్తున్నారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లుతున్నారు. గ్రామస్తులు సీజనల్ వ్యాధుల బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.



కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగిస్తున్న కూలీలు